

**కాలుష్య నివారణకే ఇథనాల్**

కాలుష్య నివారణకే పెట్రోల్‌లో ఇథనాల్ కలుపుతున్న విషయమై అవగాహన పెరగాలని డీఎస్‌ఓ చందన్‌కుమార్ సూచించారు. 8లో



**నిబద్ధత గల కమ్యూనిస్టు...**

సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మృతితో నిబద్ధత కలిగిన కమ్యూనిస్టును కోల్పోయామని పార్టీ జాతీయ నేత నారాయణ అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం 36° / 19°

**వాతావరణం**

జిల్లాలో బుధవారం మధ్యాహ్నం ఎండ ఎక్కువగానే ఉంటుంది. సాయంత్రం తర్వాత చలి తీవ్రత నమోదవుతుంది.

## న్యూస్‌రీల్

### రాజ్‌భవన్‌లో మల్లెమడుగు విద్యార్థులు



విద్యార్థులతో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఖమ్మం అర్బన్: ఖమ్మం అర్బన్ మండలం మల్లెమడుగులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు హైదరాబాద్ రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మంగళవారం కలిశారు. తొలుత విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ జిల్లాలో పీఎంశ్రీ పాఠశాలల వివరాలు, జరుగుతున్న అభివృద్ధి పనులను గవర్నర్‌కు వివరించారు. ఆతర్వాత పాఠశాలలో బోధన, విద్యార్థుల సామర్థ్యాలను గవర్నర్ అడిగి తెలుసుకోగా, రాజ్‌భవన్ ప్రత్యేకతలను సిబ్బంది తెలిపారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణి, ఉపాధ్యాయులు శారద, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

### పకడ్బందీగా వ్యాక్సినేషన్



ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కళావతిబాయి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వైద్యాధికారులు, ఫార్మసిస్టులు, ఆరోగ్య సిబ్బందికి యాప్‌ల నిర్వహణ, వ్యాక్సినేషన్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాప్‌ల్లో వివరాలను ఫార్మసిస్టులు, ఏఎన్‌ఎంలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు. అలాగే, అసంక్రమణ వ్యాధుల నియంత్రణ, మాతా శిశు సంక్షేమం, లెప్రసీ నివారణ కార్యక్రమాల లక్ష్యాలను మార్చి నెలాఖరుకల్లా పూర్తిచేయాలని చెప్పారు. ఆతర్వాత రాష్ట్ర అధికారి డాక్టర్ జ్యోత్స్న, ఎస్‌ఎంఓ డాక్టర్ మురారి పలు అంశాలపై అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సైదులు, పీఓలు చందునాయక్, డాక్టర్ రామారావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### యాతాలకుంట టన్నెల్ భూసేకరణకు రూ.50కోట్లు


ఖమ్మంఅర్బన్: సీతారామ ప్రాజెక్టులో భాగమైన సత్తుపల్లి ట్రంక్(యాతాలకుంట టన్నెల్) నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు సంబంధించి రూ80 కోట్లలో మొదటి విడతగా రూ.50కోట్ల నిధులు విడుదలయ్యాయి. ప్రాజెక్టు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిధులు పెండింగ్ ఉన్న విషయాన్ని మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మొదటి విడతగా రూ.50 కోట్లు విడుదల చేస్తే పనులు ప్రారంభమవుతాయని వివరించడంతో సీఎం ఆర్థికశాఖకు ఆదేశాలు జారీ చేశారని మంత్రి తుమ్మల ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, సీఎం స్పందించి నిధులు మంజూరు చేయడంతో ఈ ఏడాది సత్తుపల్లికి సుమారు రెండు లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించే అవకాశముందని తుమ్మల వెల్లడించారు.

### జిల్లాకు చేరిన ఇంటర్ ప్రశ్నాపత్రాలు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు వచ్చేనెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనేపథ్యాన విడతల వారీగా జిల్లాకు ప్రశ్నాపత్రాలు పంపిస్తున్నారు. ఇప్పటికే మూడు సెట్ల ప్రశ్నాపత్రాలు రాగా అందులో రెండు జనరల్ సెట్లు, ఒక సెట్ ఒకేషనల్ కోర్సుల ప్రశ్నాపత్రాలు ఉన్నాయి. వీటిని ఖమ్మం నయాబజార్ జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. ఇదిలా ఉండగా క్యూ ఆర్ కోడ్‌తో కూడిన హాల్ టికెట్లు కళాశాలల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే కంట్రోల్‌రూమ్‌ను 99489 04023 నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

### మానవ అక్రమ రవాణాను అరికడదాం..

ఖమ్మంవన్‌టౌన్: వెట్టిచాకిరీ, మానవ అక్రమ రవాణా నిర్మూలనను పౌరులంతా బాధ్యతగా భావించాలని అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్ సూచించారు. ఇలాంటి ఘటనల సమాచారం తెలిస్తే డయల్ 100 లేదా 112, 1098కు తెలియచేయాలని పేర్కొన్నారు. వెట్టిచాకిరీ, మానవ అక్రమ రవాణాపై యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్(ఎయిడ్) సంస్థ రూపొందించిన వాల్‌పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండడం ద్వారా ఆపద నుంచి రక్షించుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ బాలాజీతో పాటు ఎస్.హరిప్రసాదరావు, శ్రీనివాస్, కుటుంబరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం మార్కెట్ యార్డుల్లో నిండిన మిర్చి బస్తాలు

# మిర్చికి డ్రాగన్ దెబ్బ

**ఇక్కడి తేజ మిర్చి కంటే తక్కువ ధరకే చైనాలో సరుకు**

- ఆయిల్ కంపెనీలు సైతం అక్కడి మిర్చి వైపే మొగ్గు
- ఫలితంగా గత ఏడాదితో పోలిస్తే పడిపోయిన ధర
- ఓ పక్క దిగుబడి తగ్గి, మరోపక్క ధర లేక రైతుల ఆవేదన

చైనాలో లభిస్తున్న మిర్చితో దేశీయంగా తేజ రకం మిర్చి ధర పతనమవుతోంది. గత ఏడాది సీజన్‌లో ఇక్కడ క్వింటా మిర్చి రూ.20వేల నుంచి రూ.22 వేల ధర పలకగా.. ఎగుమతులూ జోరుగా జరిగాయి. ఈసారి ఎగుమతులు ఉన్నా ధర రూ.13వేల నుంచి రూ.14 వేలకు మించడం లేదు. చైనాలో మిర్చి అధికంగా సాగవడం, తేజ మిర్చికి ఇక్కడితో పోలిస్తే ఆ దేశంలో ధర తక్కువగా ఉండడం ఇందుకు కారణంగా తెలుస్తోంది. మరోపక్క నల్లనల్లి, ఇతర వైరస్‌లతో దిగుబడి తగ్గడంపై రైతుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

**ఎగుమతులతోనే ధర..**

రాష్ట్రంలోని ఖమ్మం, వరంగల్ మార్కెట్లలో మిర్చి కొనుగోలు చేసే వ్యాపారులు విదేశాలకు ఎగుమతి చేస్తారు. ఖమ్మం మార్కెట్‌కు ఎక్కువగా తేజ రకం (ఘాటు మిర్చి) మిర్చి తీసుకొస్తారు. ఇక్కడి వ్యాపారులు చైనా, థాయిలాండ్, మలేషియా, ఇండోనేషియా, బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తారు. సగటున ఖమ్మం మార్కెట్‌కు 30లక్షల క్వింటాళ్లు అమ్మకానికి వస్తే.. అందులో 15లక్షల క్వింటాళ్లు విదేశాలకే ఎగుమతి అవుతాయి. గత ఏడాది మొత్తంగా 30,31,902 క్వింటాళ్ల మిర్చి క్రయవిక్రయాలు జరగగా, ఫిబ్రవరి 10–15 తేదీల మధ్య క్వింటాకు రూ.20వేల నుంచి రూ.22వేల వరకు పలకడంతో వ్యాపారులతో పాటు రైతులు లాభపడ్డారు.

**నాణ్యత లేక.. దిగుబడి రాక**

ఈసారి మిర్చి దిగుబడి ఆశించిన మేర రావడం లేదు. మంచి ధర ఉంటుందనే భావనతో రైతులు సాగు చేసినా తెగుళ్ల సోకాయి. గత ఏడాది ఎకరాకు 25క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తే.. నల్ల నల్లి తదితర వైరస్‌లతో ఈసారి 15 – 16 క్వింటాళ్లు దాటడం లేదు. ఎకరానికి రూ.లక్ష మేర పెట్టుబడి పెట్టినా పంట నాణ్యంగా ఉండడం లేదని రైతులు వాపోతున్నారు.

**దేశీయంగానూ చైనా వైపే..**

గతంలో మిర్చితో పాటు ఆయిల్(ఆహార ఉత్పత్తుల్లో ఉపయోగానికి)ను చైనాకు ఎగుమతి చేయగా.. ఇప్పుడు ఇక్కడి కంపెనీలు చైనా వైపే చూస్తున్నాయి. అక్కడ తక్కువ ధరకే ఆయిల్ లభిస్తుండడంతో కొన్ని దేశీయ కంపెనీలు సైతం దిగుమతి చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కర్ణాటకలో సాగయ్యే బ్యాడిగి 5531 రకం మిర్చి రంగు ఎక్కువగా, ఘాటు తేజ కంటే తక్కువగానే ఉండడంతో ఆ మిర్చిని సైతం ఆహార పదార్థాల తయారీలో ఉపయోగిస్తున్నట్లు చెబుతున్నారు.

**చైనాలోనూ సాగు**

ఖమ్మం మార్కెట్ నుంచి 2016 వరకు అంతంత మాత్రంగానే ఎగుమతులు ఉన్నా ఆ తర్వాత జోరందుకున్నాయి. చైనాలో మిర్చి సాగు తక్కువగా, ఘాటు ఎక్కువగా ఉండకపోవడంతో ఎగుమతులు బాగుండేవి. అయితే ఈసారి చైనాలో ఘాటు మిర్చి ఎక్కువగా సాగైంది. దీనికి మన రాష్ట్ర రైతులు మిర్చి తోటల్లో మందులు అధిక మోతాదులో వాడడంతో కొనుగోలుకు అక్కడి కంపెనీలు ఆసక్తి చూపడం లేదు. ఈ కారణాలతో ఎగుమతులు నామమాత్రమై ధర తగ్గింది.

**చైనా మిర్చితో తగ్గిన డిమాండ్**



ఇక్కడ పండే తేజ మిర్చి చైనాకు ఎగుమతి అవుతుంది. అయితే ఈసారి అక్కడా సాగవడంతో మన మిర్చికి ధర తగ్గింది. ఇక్కడి మిర్చి క్వింటా రూ.13 వేలు ఉంటే.. అక్కడ రూ.9వేలకే లభిస్తోంది. ఫలితంగాఎగుమతులు పడిపోయాయి. దీంతో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేయాల్సి వస్తోంది.

– గీతా వెంకన్న, మిర్చి అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, ఖమ్మం

**ఎగుమతులు ఉన్నా ధర లేదు..**



ఈసారి ఎగుమతులు ఉన్నా ధర లేదు. మన దగ్గర నాణ్యమైన మిర్చి రాక ఎగుమతి చేయలేకపోతున్నారు. భూమిలో సారం తగ్గడంతో మిర్చిలో కారం కూడా తగ్గుతోంది. ఇది ధర తగ్గడానికి ఓ కారణం. చైనాలో మిర్చి దిగుబడి బాగుండటంతో ఇక్కడి మిర్చికి ధర తగ్గుతోంది.

– దొంగరి నాగరాజు, ఎగుమతిదారు, ఖమ్మం

**ఈ ఏడాది ధర తగ్గింది..**



ఖమ్మం మార్కెట్‌కు 15 బస్తాల మిర్చి తీసుకొస్తే రూ.13 వేల ధర పడింది. గత ఏడాది రూ.22 వేలకు విక్రయించా. ఈసారి కూడా అదే ధర ఉంటుందనుకుంటే నిరాశే మిగిలింది. కొంత కౌలు, ఇంకొంత సొంత భూమిలో పంట పండించా. తెగుళ్లతో దిగుబడి తగ్గగా ధర కూడా పడిపోయింది.

– బానోతు దస్రు, లచ్చాయిగూడెం, కూసుమంచి మండలం

## పంటలు ఎండిపోతున్నాయి.. కాపాడండి

బోనకల్: సాగర్ జలాలను వారబందీ విధానంలో విడుదల చేస్తుండడంతో చివరి ఆయకట్టుకు నీరు అందక మొక్కజొన్న, తదితర పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యాన జిల్లా వ్యవసాయ శాఖాధికారి డి.పుల్లయ్య, నీటి పారుదలశాఖ డీఈ తమ్మారపు వెంకటేశ్వర్లు మంగళవారం బోనకల్ మండలం నారాయణపురంలో పంటలను పరిశీలించారు. నారాయణపురం మైనర్ కింద సాగవుతున్న మొక్కజొన్న వారబందీ విధానంతో ఎండిపోతోందని రైతులు వివరించారు. వారబందీ విధానానికి తోడు అదనంగా రెండు, మూడు రోజులు నీరు విడుదల చేయాలని కోరారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ మొక్కజొన్న వడలితే రెండు శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేసుకోవచ్చని తెలిపారు. అలాగే, భూముల్లో భాస్వరం సరిపడా ఉన్నందున పైపాటుగా కాంప్లెక్స్ ఎరువు మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. మధిర ఏడీఏ స్వర్ణ విజయ చంద్ర, నీటి పారుదలశాఖ శాఖ ఏఈ ఏడుకొండలు, ఏఈఓలు షేక్ హుస్సేన్ సాహెబ్, నాగినేని నాగసాయి తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య, అధికారులు

**వారబందీ విధానం తొలగించండి**

ఖమ్మం మామిళ్లగూడెం: సాగర్ చివరి ఆయకట్టు భూముల్లో పంటలు ఎండిపోకుండా వారబందీ విధానాన్ని తొలగించి నీరు సరఫరా చేయాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు కోరారు. ఈసందర్భంగా జలవనరుల శాఖ అధికారులు రమేష్‌బాబు, ధనకుమార్‌రెడ్డికి మంగళవారం సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం మొక్కజొన్న కంకి దశలో ఉన్నందున నీరు ఎక్కువగా అవసరమవుతోందని, ఈ నేపథ్యాన మధిర, బోనకల్ బ్రాంచ్ కెనాళ్ల పరిధిలో వారబందీ విధానం కాకుండా నిరంతరం నీరు విడుదల చేయాలని కోరారు. నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, ఎస్.కే.మీరా, తోట వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## లోడ్‌కు అనుగుణంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు

**ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ సురేందర్**

ఖమ్మంవ్యవసాయం/నేలకొండపల్లి: రానున్న వేసవిలో వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్‌ఈ ఏ.సురేందర్ తెలిపారు. నేలకొండపల్లి మండలంలోని చెన్నారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం ఇంటర్ లింక్ లైన్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే, వేసవి ప్రణాళికలో భాగంగా ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను ఖమ్మంలో వెల్లడించారు. జిల్లాలోని 35 సబ్‌స్టేషన్లలో ఇంటర్ లింక్ లైన్లు ఏర్పాటు చేయనుండగా, ఆరు కేంద్రాల్లో పనులు పూర్తయ్యాయని తెలిపారు. తద్వారా వీటి పరిధిలో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయంగా సరఫరాకు అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే, లోడ్ పెరిగే అవకాశం ఉన్న చోట 15 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయగా, ఏడు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామని, 65 నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. అంతేకాక విద్యుత్ అంతరాయాలను అరికట్టేందుకు ఫీడర్లు వేరు చేశామని, పలుచోట్ల వీసీబీలు ఏర్పాటు చేశామని, సబ్‌స్టేషన్లలో సూక్ష్మ లోపాలను గుర్తించేందుకు ఇమేజింగ్ కెమెరాలు వినియోగిస్తున్నామని తెలిపారు. అంతేకాక లైన్లలో 13 కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేశామని ఎస్‌ఈ వివరించారు. కాగా, నేలకొండపల్లిలో జరిగిన లైన్ ప్రారంభ కార్యక్రమంలో డీఈఈ చింతమళ్ల నాగేశ్వరరావు, ఏడీఈ కోక్యానాయక్, ఏఈ నారాయణరావుతో పాటు సిబ్బంది గోవిందరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.



చెన్నారంలో ఇంటర్ లింక్ లైన్‌ను ప్రారంభించిన ఎస్‌ఈ సురేందర్, ఉద్యోగులు

## 'విద్యారంగ అభివృద్ధికి పాటుపడిన నర్సిరెడ్డి'



ఖమ్మం రూరల్ : మాట్లాడుతున్న చావా రవి, పక్కన నాయకులు

వైరా/ఖమ్మం రూరల్/మధిర: గత ఆరేళ్లలో ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డి విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి తెలిపారు. ఆయనకు మంజూరైన వంద శాతం నిధులు విద్యాసంస్థల అభివృద్ధికే కేటాయించినందున ఉపాధ్యాయులు మరోమారు నర్సిరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. వైరా, ఖమ్మం రూరల్, మధిర మండలాల్లోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం ప్రచారం చేసిన చావా రవి మాట్లాడారు. టెట్ వివాదం సహా అనేక సమస్యల పరిష్కారానికి పాటుపడిన నర్సిరెడ్డిని ఇంకోసారి గెలిపించాలని, తద్వారా కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, డీఏల మంజూరు, పీఆర్సీ అమలుకు కృషి చేస్తారని తెలిపారు. ఈసమావేశాల్లో టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్, ఏ.వీ.నాగేశ్వరరావు, ఆయా సంఘాల నాయకులు షమీ, ఉద్దండు, షరీఫ్, జి.రాజశేఖర్, జి.రామకృష్ణ, సుధాకర్, అనితాదేవి, కృష్ణారావు, వెంకటేశ్వరరావు, ప్రసాద్, పి.మహేష్, ముత్తయ్య, షేక్ నాగూర్ వలీ, ఏ.వినోద్‌రావు ఈ.వీరయ్య, తాళ్లూరు ఆంజనేయులు, ఆర్.లక్ష్మణరావు, మీరాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఊరూవాడ శివనామస్మరణ

జిల్లాలో ఊరూవాడ శివనామస్మరణ మార్మోగనుంది. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో బుధవారం తెల్లవారునుంచే అభిషేక పూజలు మొదలుకానున్నాయి. అలాగే, అర్ధరాత్రి లింగోద్భవ సమయాన శివపార్వతుల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని తీర్థాల, స్నానాల లక్ష్మీపురంలో జరిగే జాతరకు వేలాదిగా భక్తులు హాజరుకానున్న నేపథ్యాన అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కూసుమంచిలోని కాకతీయుల కాలం నాటి శివాలయం(గణపేశ్వరాలయం)లో మంగళవారం రాత్రి ధ్వజారోహణ, అంకురార్పణతో వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఆలయంలోని శివలింగానికి సాధు వీరప్రతాప్‌రెడ్డి కుటుంబీకులు అన్నాభిషేకం చేయగా ఆలయ చైర్మన్ రేలా ప్రదీప్‌రెడ్డి, ఈఓ కామని శ్రీకాంత్, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



అన్నాభిషేకంలో కూసుమంచి గణపేశ్వరాలయంలోని శివలింగం



విద్యుత్ దీపాలంకరణలో ఖమ్మంలోని గుంటుమల్లేశ్వర స్వామి ఆలయం

## పక్కాగా లే ఔట్ల పరిశీలన

- నీటి వనరుల వివరాలు నమోదు చేయాలి
- మార్చి 31లోగా దరఖాస్తుల పరిశీలన పూర్తి
- ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన కమిషనర్ అభిషేక్, ఆర్డీఓ నర్సింహారావు

ఖమ్మంమయూరిసెంటర్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనలో భాగంగా క్షేత్ర స్థాయిలో లే ఔట్లను తప్పనిసరి తనిఖీ చేయాలని, కాల్వలు, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంటే రికార్డుల్లో నమోదు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కేఎంసీలో కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి సమీక్షించిన ఆయన మాట్లాడుతూ మార్చి 31లోగా దరఖాస్తులను పరిష్కరించేలా టౌన్ ప్లానింగ్, సుడా, కార్పొరేషన్ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖల వద్ద ఎక్కువ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నందున పరిశీలనలో వేగం పెంచాలని సూచించారు. ప్రభుత్వ భూములు, కోర్టు కేసులు, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో లేనివైతే ఆమోదించాలని తెలిపారు. కాగా, రెవెన్యూ, నీటి పారుదల శాఖల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి, రోజువారీ లక్ష్యాలను నిర్దేశించాలని చెప్పారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడగా ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

**ప్రశాంత వాతావరణంలో రంజాన్ మాసం నిర్వహణ**

మత సామరస్యాన్ని కొనసాగించేలా ప్రశాంత వాతావరణంలో పవిత్ర రంజాన్ మాసం ప్రార్థనలు పూర్తయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఈమేరకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ముస్లిం మత పెద్దలు, సంబంధిత అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రార్థనలకు మసీదులు, ఈద్గాల్లో ఏర్పాట్లు చేయాలని, ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సమస్యలను మత పెద్దలు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ రంజాన్ మాసం నేపథ్యంలో పటిష్ట బందోబస్తు చేయడంతో పాటు ఎక్కడా కూడా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాగా, మసీదుల పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మత పెద్దలకు సూచించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డాక్టర్ బి.పురంధర్, డీపీఓ ఆశాలత, ఆర్డీఓలు నరసింహారావు, ఎల్.రాజేందర్, మధిర మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ షఫీ ఉల్లా పాల్గొన్నారు. ఆతర్వాత ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకొని రూపొందించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు.

### ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో గురువారం జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 4,089 మంది ఓటర్ల కోసం 24 కేంద్రాలు ఏర్పాటుచేయగా, గురువారం ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందని వెల్లడించారు. ఇందుకోసం తొమ్మిది మంది సెక్టార్ అధికారులు, 28 మంది ప్రిసైడింగ్ అధికారులు, 27 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 58 ఇతర సిబ్బంది, 28 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని తెలిపారు. కలెక్టరేట్ నుంచి సిబ్బంది సామగ్రి తీసుకుని పోలింగ్ కేంద్రాలకు వెళ్తారని, ఆతర్వాత నల్లగొండలోని రిసెప్షన్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు పంపిస్తామని వివరించారు.

## ఇరువురు స్టాఫ్‌నర్స్‌లకు అస్వస్థత

**నేలకొండపల్లి:** స్థానిక సీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు స్టాఫ్ నర్స్‌లు మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. స్టాఫ్‌నర్స్ ఉష కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోగా ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ఆతర్వాత కాసేపటికి మరో స్టాఫ్‌నర్స్ శ్రీదేవికి ఫిట్స్ రావడంతో వైద్యాధికారి కె.రాజేష్ చికిత్స చేశారు.

## క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన టెన్నిస్ టోర్నీ



క్రీడాకారులతో ట్రాఫిక్ సీఐ సాంబశివరావు

**ఖమ్మంస్పోర్ట్స్:** వివిధ రాష్ట్రాల క్రీడాకారులు తలపడుతున్న ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీ క్వార్టర్ ఫైనల్స్ దశకు చేరింది. ఖమ్మం పటేల్ స్టేడియంలో జరుగుతున్న పోటీల్లో భాగంగా మంగళవారం తెలంగాణ క్రీడాకారుడు శశాంక్ 7-5, 2-6, 6-2 స్కోరు తేడాతో సర్‌తక్ గులాటి(పంజాబ్)ని ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించాడు. అలాగే, డబుల్స్‌లో శశాంక్(తెలంగాణ), శర్మ(మహారాష్ట్ర) - సంకేశామ్‌చౌహాన్, ఆదిత్య రాణావాడే(మహారాష్ట్ర)పై 6-0, 6-1 తేడాతో నెగ్గి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరారు. ఇంకా సింగిల్స్‌లో ఉదిత్‌కాంబోజ్(హరియాణా), శర్మ(మహారాష్ట్ర), రిక్కిచౌదరి(ఢిల్లీ), జితిన్‌సైనా(హరియాణా), సందేస్ డి.కురేల్(మహారాష్ట్ర), వణిష్‌బిషాత్(ఢిల్లీ), జయప్రకాష్(తమిళనాడు) క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించారు. డబుల్స్‌లో జయప్రకాష్, ఉదిత్ కాంబోజ్ జోడీ గెలుపొందారు. మంగళవారం మ్యాచ్‌లను ఖమ్మం ట్రాఫిక్ సీఐ సాంబశివరావు ప్రారంభించగా, టోర్నీ నిర్వాహకులు చల్లపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ అనిల్, కాంపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్య నివారణ కోసమే ఇథనాల్

**ఖమ్మంరూరల్:** కాలుష్య నివారణ కోసమే పెట్రోల్‌లో ఇథనాల్ కలుపుతున్న విషయమై అవగాహన పెంపొందించుకోవాలని డీఎస్‌ఓ చందన్‌కుమార్ సూచించారు. ఖమ్మం రూరల్ మండలం సింహాద్రినగర్‌లో జిల్లా పెట్రోలియమ్ డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పెట్రోల్‌లో 20శాతం ఇథనాల్ ఉంటుందని, తద్వారా కాలుష్య నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. కాగా, బంక్‌ల డీలర్లు రికార్డులు సరిగ్గా నిర్వహించడమేకాక తాగునీటి వసతి, టాయ్‌లెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పెట్రోలియమ్ అసోసియేషన్ డీలర్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరప్రగడ రంగనాథ్,కూరపాటి మంజుల మాట్లాడగా డీ.జీ.విజయ్‌బాబు, వి.శ్రీనివాసరవికుమార్, నాగబత్తిని రవి, నన్నే ఉదయ్‌ప్రతాప్, ఎం.గోపాల్‌రావు, వి.శ్రీనివాస్, డి.నగేష్, ఏ.విప్లవ్‌కుమార్, ఎం.దిలీప్‌రెడ్డి, డి.రవికుమార్, డి.డానియేల్, పి.వంశీతో పాటు కిషన్, సురేష్ పాల్గొన్నారు.

## నిబద్ధత గల కమ్యూనిస్టును కోల్పోయాం

**ఖమ్మం మామిళ్లగూడెం:** సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మృతితో నిబద్ధత, అంకితభావం కలిగిన కమ్యూనిస్టును కోల్పోయామని పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. ఖమ్మంలో ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. అంకితభావంతో కమ్యూనిస్టు పార్టీ విస్తరణ, ప్రజా ఉద్యమ నిర్మాణాలకు ఆయన కృషి చేశారని గుర్తు చేశారు. అమెరికాలో ఉన్న సమయాన విషయం తెలియడంతో దిగ్భ్రాంతికి గురయ్యానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ కుటుంబీకులు నిర్మల, సాత్విక్, పోటు కళావతి, పోటు పూర్ణచంద్రరావు, సీపీఐ నాయకులు దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, గాదె లక్ష్మీనారాయణ, శ్రీరాములు, కూచిపూడి రవి, మదుపల్లి లక్ష్మణ్, ఇటికాల రామకృష్ణ పాల్గొన్నారు.

## వలస కూలీ ఆత్మహత్య

**ఖమ్మంక్రైం:** ఖమ్మంలో రైల్వే మూడో లైన్ పనులకు వచ్చిన వలస కూలీ మంగళవారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని మిడ్నాపూర్‌కు చెందిన జంటు కోటాల్(40) రైల్వే మూడో లైన్ పనులు చేసేందుకు కొన్నాళ్ల క్రితం ఖమ్మం వచ్చాడు. ఆయన భార్య, పిల్లలు స్వగ్రామంలోనే ఉండగా, భార్యతో కుటుంబ కలహాలు జరుగుతున్నాయని సమాచారం. ఇందులో భాగంగా మంగళవారం పనికి వెళ్లని ఆయన రాపర్తినగర్ బైపాస్ సమీపాన గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు తెలిపారు. రైల్వే పోలీసులు ఇచ్చిన సమాచారంతో అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు చేరుకుని కోటాల్ మృతదేహాన్ని మార్చురీకి తరలించాడు.

## భర్త వేధింపులతో వివాహిత...

**చింతకాని:** మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన సోమ జ్యోతి(29) ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. కొణిజర్ల మండలం రాజ్యాతండాకు చెందిన జ్యోతి, రామకృష్ణాపురానికి చెందిన సోమ నరేష్ 13ఏళ్ల క్రితం కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆతర్వాత నరేష్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని నాలుగు నెలలుగా భార్యను వేధిస్తున్నాడు. దీంతో ఆమె సోమవారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. జ్యోతి దంపతులకు ఇద్దరు పిల్లలు ఉండగా, ఆమె సోదరుడి ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

## కూలీల ఆటోను ఢీకొట్టిన కారు

**కూసుమంచి:** మిర్చి తోటలో పనులకు వెళ్తున్న కూలీల ఆటోను మండలంలోని నాయకన్‌గూడెం జాతీయ రహదారి ఫ్లై ఓవర్ వద్ద కారు ఢీకొట్టగా పది మందికి గాయాలయ్యాయి. నాయకన్‌గూడెంకు చెందిన కూలీలు సూర్యాపేట జిల్లా మోతె మండలంలో మిర్చి కోసేందుకు మంగళవారం బయలుదేరారు. వీరి ఆటోను ఖమ్మం నుండి సూర్యాపేట వెళ్తున్న కారు ఆటోను వెనక నుండి ఢీకొట్టింది. దీంతో బి.పద్మ, సారమ్మ, జి.పద్మకు తీవ్ర గాయాలు కాగా మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రమాదంపై ఆరాతీసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

## చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్ష

**ఖమ్మం లీగల్:** తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో ఖమ్మం నెహ్రూనగర్‌కు చెందిన వి.విజయ్‌కుమార్‌కు ఏడాది జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ మంగళవారం తీర్పు చెప్పారు. ఖమ్మం వీడీవోస్ కాలనీకి చెందిన కమతం కమల్ వద్ద విజయ్‌కుమార్ 2015 జూన్‌లో రూ.10లక్షల అప్పు తీసుకున్నాడు. ఈ అప్పు చెల్లించే క్రమాన 2018 ఏప్రిల్‌లో రూ.16.80 లక్షలకు చెక్కు జారీచేయగా ఆయన ఖాతాలో నగదు లేకపోవడంతో తిరస్కరణకు గురైంది. దీంతో కమల్ కోర్టులో దాఖలు చేయగా, నేరం విజయ్‌కుమార్‌కు ఏడాది జైలుశిక్ష విధించడమే కాక రూ.16.80లక్షలు ఫిర్యాదికి చెల్లించాలని తీర్పు చెప్పారు. అలాగే, మరో చెల్లని చెక్కు కేసులో కూడా నిందితుడికి ఏడాది జైలుశిక్ష, ఫిర్యాదికి నగదు చెల్లించాలని ఇదే కోర్టు న్యాయాధికారి తీర్పు వెలువరించారు.

**మహిళను గాయపర్చిన వ్యక్తికి జైలుశిక్ష**

**వేంసూరు:** మహిళను బ్లేడ్‌తో గాయపరిచిన వ్యక్తికి రెండు నెలల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ సత్తుపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.కే. ఆయేషా సరీన్ మంగళవారం తీర్పు చెప్పారు. వేంసూరు మండలం కల్లురుగూడెంకు చెందిన పురం వెంకటేశ్వరరావు 2018 అక్టోబర్ 24న అదే గ్రామంలో చికెన్ షాప్ నడుపుతున్న పిట్టల సూర్యనారాయణ భార్య ఉషారాణిపై బ్లేడ్‌తో దాడి చేశాడు. ఈమేరకు కేసు విచారణ అనంతరం వెంకటేశ్వరరావుకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

## రూ.89 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

**కూసుమంచి:** కూసుమంచి మండలం చేగొమ్మ క్రాస్ వద్ద సోమవారం రాత్రి చేపట్టిన తనిఖీల్లో 178.87 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరిని అరెస్ట్ చేయగా ఆరుగురిపై కేసు నమోదు చేశామని వెల్లడించారు. కూసుమంచి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం అదనపు డీసీపీ ప్రసాదరావు వివరాలు వెల్లడించారు. ఎస్సై నాగరాజు ఆధ్వర్యాన వాహనాల తనిఖీ చేపట్టగా ఓ కారు డిక్కీలో గంజాయి లభించింది. కారులో హైదరాబాద్‌కు చెందిన ట్రావెల్స్ నిర్వాహకులు పల్లపు రఘు, మహ్మద్ ఖాజా పాషా పట్టుబడ్డారని తెలిపారు. ఒడిశాలోని బాబు, సుబ్బు, రామాంజనేయులు వద్ద తక్కువ ధరకు గంజాయి కొని పూణెకు చెందిన సోహైల్ ద్వారా ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు అంగీకరించారని అదనపు డీసీపీ వెల్లడించారు. ఈమేరకు పట్టుబడిన రఘు, ఖాజా పాషాతో పాటు మిగతా నలుగురిపైనా కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితుల నుండి కారుతో పాటు రూ.89.43 లక్షల విలువైన గంజాయి, 41గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.9వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోగా, గంజాయిని పట్టుకున్న ఎస్సై, సిబ్బందిని ఆయన అభినందించారు. ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్సై నాగరాజు, అదనపు ఎస్సై శ్రీధరాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.38లక్షలకు ఐపీ దాఖలు

**ఖమ్మం లీగల్:** నేలకొండపల్లి మండలానికి తిరువాయిపాటి వెంకటేశ్వరరావు రూ.38.20 లక్షలకు గాను మంగళవారం దివాళా పిటిషన్(ఐపీ) దాఖలు చేశాడు. రియల్ ఎస్టేట్, వైన్స్ వ్యాపారం చేసిన ఆయన పలువురి అప్పులు తీసుకున్నాడు. ప్రస్తుతం అవి తీర్చలేని పరిస్థితి ఎదురైందంటూ ఏడుగురిని ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాది ద్వారా ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాళా పిటీషన్ దాఖలు చేశాడు.